వ్యర్థాలతో కాలుష్య కాసారం

● వర్షం మాటున వ్యర్థ రసాయనాలు విడుదల
● ఆందోళనలో అన్నదాతలు పట్టించుకోని పీసీబీ అధికారులు

జిన్నారం (పటాన్‌చెరు): రసాయన పరిశ్రమలు కాలుష్య వ్యర్థాలు విడుదల చేయడంతో చెరువులు, కుంటల్లోని నీరు ఎరుపెక్కాయి. గుమ్మడిదల పట్టణం బొంతపల్లి పారిశ్రామికవాడలోని హెటిరో డ్రగ్స్ యూనిట్‌-4 పరిశ్రమ ఇటీవల కురిసిన వర్షాల మాటున స్థానిక నల్లకుంట చెరువులోకి భారీగా రసాయన వ్యర్థాలను విడుదల చేసింది. దీంతో చెరువు పూర్తిగా ఎరుపు రంగులోకి మారిపోయింది. పక్కనే ఉన్న పంటపొలాల్లోకి ఆ నీరు చేరడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో పరిశ్రమ యాజమాన్యాలు ఇదే వైఖరిని అవలంబిస్తూ భూగర్భజలాలనే కాకుండా పంటపొలాలను సైతం తీవ్రంగా నష్టపరుస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వాయుకాలుష్యంతో ఊపిరాడక శ్వాసకోస వ్యాధులతో గ్రామంలోని ప్రతి ఇంట్లో ఇద్దరు అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారని వాపోయారు. ఈ సందర్భంగా పీసీబీ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఇప్పటికే పలు మార్లు పీసీబీ, జిల్లా ఉన్నతాధికారులతో మొరపెట్టుకున్న చలనం లేదన్నారు. పరిశ్రమ యాజమాన్యంతో పీసీబీ అధికారులు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. సమస్యను పరిష్కరించకుంటే ఆందోళనలు చేపడతామని రైతులు హెచ్చరించారు.


అలుగు నుంచి ప్రవహిస్తున్న వ్యర్థాల ప్రవాహం


వ్యర్థాలతో ఎరుపురంగులోకి మారిన చెరువు


వ్యర్థాలు చేరడంతో ఆవేదన చెందుతున్న రైతు

క్లుప్తంగా

బీసీ బంద్‌కు సంపూర్ణ మద్దతు

నారాయణఖేడ్: బీసీ సంఘాల పిలుపు మేరకు ఈనెల 18నాటి బంద్‌కు సీపీఐ సంపూర్ణ మద్దతు ఉంటుందని సీపీఐ జిల్లా నాయకులు చిరంజీవి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బీసీలపై వివక్షత చూపుతుందన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ రాష్ట్ర ప్రభుత్వంపై వివక్షత చూపుతుందని విమర్శించారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు 42శాతం రిజర్వేషన్ సదుపాయం కల్పించాలని కోరారు. రిజర్వేషన్ సాధన కోసం బీసీ సంఘాల బంద్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు.

ఐదుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను బుధవారం కోర్టులో హాజరుపర్చగా నలుగురికి రూ.వెయ్యి, మరో వ్యక్తికి రూ.3 వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

బీజేపీలో పలువురు చేరిక


ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరిన నాయకులు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం నవాబుపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు ఎంపీ రఘునందన్ రావు సమక్షంలో బుధవారం బీజేపీలో చేరినట్లు ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నాగ ప్రభుగౌడ్ తెలిపారు. నవాబుపేట గ్రామంలో బీజేపీ వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో కాషాయం జెండా ఎగురవేయాలని ఎంపీ రఘునందన్ రావు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు మల్లేశం గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజ మల్లారెడ్డి, నాయకులు చంద్రగౌడ్ ,నాగేశ్ , పాండు, మల్లేశం, రామచందర్ ,శ్రీశైలం, జనార్దన్ ,వెంకటేశం గుప్తా, ప్రభు నాగేష్, తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ


సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ జగ్జీవన్

నారాయణఖేడ్: పట్టణంలోని 8వ వార్డుకు సంబంధించి మన్సుర్‌పూర్‌లో బుధవారం మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, శానిటరీ అధికారి శ్రీనివాస్ పర్యటించారు. వార్డులోని కాలనీల్లో పర్యటిస్తూ కాలనీవాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, పారిశుద్ధ్యానికి సంబంధించిన సమస్యలను వివరించడంతో ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. కమిషనర్ స్వయంగా పర్యటించి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చొరవ చూపడంపై వార్డు వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలే

పీసీబీ ఈఈకుమార్ పాఠక్


సమావేశంలో మాట్లాడుతున్న కుమార్ పాఠక్

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం ఖాజిపల్లి పారిశ్రామికవాడలోని పరిశ్రమలు వాయుకాలుష్యాన్ని కట్టడి చేయాలని, పరిశ్రమలు నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పీసీబీ ఈఈ కుమార్ పాఠక్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం పరిశ్రమల యూనియన్ అధ్యక్షుడు మూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ...వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు పరిశ్రమలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. కాలుష్య నియంత్రణకు సంబంధించిన పరికరాలను పనితీరుపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు రవీందర్, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీ దుర్గాప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిన్నారం, గుమ్మడిదల పరిధిలోని గ్రామాల్లో ఉ.10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏఈలు రవీందర్, వెంకటేశ్వర్లు కోరారు.

భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి


ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డితో స్థానిక నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం బొల్లారం పట్టణ పరిధిలోని గాంధీనగర్ రామమందిరంలో అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో ఆధ్యాత్మికత భక్తి భావం పెంపొందించేలా నిర్వహిస్తున్న రామ్ మందిర్ ట్రస్ట్ కార్యక్రమాలను అభినందించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దాతలు లతాశ్రీ కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు చంద్రారెడ్డి, వేణుపాల్ రెడ్డి, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సంఘం సభ్యులు

వట్‌పల్లి(అందోల్): మహిళలు ఆర్థిక సాధికారత సాధించేందుకు ప్రభుత్వం , బ్యాంకులు చేయూత అందిస్తున్నాయని సీఆర్‌పీలు కవిత, ఉల్హాపాలు అన్నారు. బుధవారం మండలంలోని మర్వెల్లి గ్రామంలో స్వయం సహాయ సంఘం సభ్యులకు నగదు రహిత లావాదేవీలు, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారికంటే వ్యాపారాలు నిర్వహిస్తున్నవారే ఎక్కువ మందికి సహాయం అందించవచ్చన్నారు. నగదు రహిత లావాదేవీలను అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం పి.చంద్రశేఖర్, సీసీలు మల్లీశ్వరి, జనార్దన్, మాణెమ్మ, వీఓఏ ధనలక్ష్మి, లక్ష్మి మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఐఐటీహెచ్‌లో నూతన ఫ్లోర్ ప్రారంభం


నూతన ఫ్లోర్‌ను ప్రారంభిస్తున్న ప్రతినిధులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థ హైదరాబాద్ ఐఐటీ (భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ) ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ ట్రిజియో ఆర్థిక సాయంతో నిర్మించిన భవనంలోని ఓ అంతస్తును వేములపల్లి ఫ్లోర్ పేరుతో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీ.ఎస్.మూర్తి మాట్లాడుతూ.. ఇలాంటి కంపెనీలు ఆర్థిక సాయం అందించడమంటే విద్యాసంస్థల్లో నూతన ఆవిష్కరణలు, సాంకేతికత అభివృద్ధిని ప్రోత్సహించడమే అవుతుందన్నారు. ప్రపంచ సవాళ్లను పరిష్కరించే కంప్యూటింగ్ పరిశోధనను ప్రోత్సహించడానికి ఇది తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో ట్రిజియో సాఫ్ట్‌వేర్ కంపెనీ యాజమాన్యం కుటుంబసభ్యులు వేములపల్లి సునీత, సీఎస్‌సీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆంటోనీ ఫ్రాంక్లిన్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో లేని ఎస్‌బీఐ సేవలు


పని చేయని ఎస్‌బీఐ ఏటీఎం

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం పట్టణ కేంద్రంలోని ఎస్‌బీఐ ఏటీఎం పని చేయకపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన వినియోగదారులు అవసరాల కోసం ఏటీఎం నుంచి డబ్బులు తీసుకునేందుకు వస్తుంటారు. ఏటీఎం పనిచేయకపోవడంతో అసహనానికి గురవుతున్నారు. దీంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు. మండలంలో ఎస్‌బీఐ బ్యాంకును ఏర్పాటు చేయాలని గత కొంతకాలంగా ఖాతాదారులు అధికారులకు విన్నవించిన సందర్భాలు ఉన్నాయి. ఉమ్మడి మండలంగా ఉన్నప్పుడు గుమ్మడిదలలో బ్యాంక్ ఏర్పాటు చేశారు. గుమ్మడిదల మండలంగా ఏర్పాటైన తరువాత జిన్నారంలో బ్యాంక్ సేవలు దూరమయ్యాయి. గుమ్మడిదల, అన్నారంలో కూడా బ్యాంక్ ఉంది, కానీ జిన్నారం 15 గ్రామాలకు ఒక్క బ్యాంక్ లేకపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిన్నారంలో ఎస్‌బీఐ శాఖను ఏర్పాటు చేసి ఖాతాదారుల సమస్యను పరిష్కరించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం


సమావేశంలో మాట్లాడుతున్న రఘు

జహీరాబాద్ టౌన్: పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని ఎల్‌ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘు అన్నారు. బుధవారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీమా ప్రీమియంపై ఉన్న జీఎస్‌టీని తొలగించే వరకు యూనియన్ పోరాటం చేసిందని గుర్తు చేశారు. ఉద్యోగులు ఐక్యంగా ఉంటూ పోరాటలు చేస్తే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఆఫీస్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అశోక్, ఉపాధ్యక్షుడిగా మాణయ్య, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీలుగా చంటి, సాయిహరి, కోశాధికారిగా అశోక్(పీటీసీ), మహిళా కన్వీనర్‌గా జమున, సభ్యులుగా రాజేశ్వర్, విజయ్ భాస్కర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కారు డ్రైవర్ అదృశ్యం


చాకలి సామ్యూల్

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం... రామచంద్రపురం పరిధిలోని ఈదురు నాగులపల్లికి చెందిన చాకలి సామ్యూల్ కారు డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం ఇంట్లో ఎవరికి సమాచారం ఇవ్వకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికిన ఆచూకీ లభించలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ ఫీజులు చెల్లించాలి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్‌కు సంబంధించి పెండింగ్ ఫీజులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ స్టూడెంట్స్ వాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సంగారెడ్డిలోని ఐబీలోని అమరవీరులస్తూపం వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బంగారు కృష్ణ మాట్లాడుతూ...రాష్ట్ర వ్యాప్తంగా 237 పాఠశాల్లో 25 వేల మంది విద్యార్థులు ఈ పథకంలో భాగంగా చదుతున్నారన్నారు. ప్రభుత్వం 2022 వ సంవత్సరం నుంచి ఫీజులు విడుదల చేయకపోవడం వల్ల ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు విద్యార్థులను ఇంటికి పంపించారన్నారు. దీంతో విద్యార్థుల చదువు మధ్యలో ఆగిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, భానుప్రసాద్, రమణి అనిల్, కృష్ణ పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు నివాళి

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మహదేవుపల్లి పాఠశాలలో బుధవారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. విద్యార్థులు కలాం చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు.

ఖేడ్‌లో

నారాయణఖేడ్: అబ్దుల్ కలాం జయంతిని నారాయణఖేడ్‌లోని ఆక్సిజన్ పార్కులో బుధవారం ఘనంగా నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ రవీందర్‌నాయక్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పరుశురాం, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నగేష్, కురుమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్గొండ, నాయకులు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పొట్ట దశలో తెగుళ్లు నివారించాలి


వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ హరికృష్ణ

కల్హేర్(నారాయణఖేడ్): వరి దుబ్బు వేసే దశ నుంచి పొట్ట దశలో బ్యాక్టీరియా ఎండుతెగులు ఆశిస్తుందని సిర్గాపూర్ ఏఓ హరికృష్ణ తెలిపారు. బుధవారం సిర్గాపూర్ మండలంలోని బోక్కస్‌గాం శివారులోని వరి పొలాలను పరిశీలించారు. ప్రధానంగా వర్షాలు నాలుగైదు రోజులు పడినప్పుడు, రాత్రి ఉష్ణోగ్రతలు 22 డిగ్రీల సెల్సియస్ ఉన్నప్పుడు ఈ తెగులు వ్యాపిస్తుందని తెలిపారు. ప్రధానంగా ఆకుల చివరి భాగంలో పసుపు రంగులో మచ్చలు ఏర్పడి పైభాగం నుంచి కింది భాగం వరకు అలల మాదిరిగా వ్యాప్తి చెందుతుంది. ఆకుల అంచున ఎండిపోవడం ప్రధాన లక్షణం అని తెలిపారు. పోషక లోపాలని అనుకోకుండా ఇది కేవలం బ్యాక్టీరియా ఎండు తెగులుగా నిర్ధారించి నివారణ కోసం వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు పాటించాలని తెలిపారు. తెగుళ్లు ఆశించినప్పుడు దిగుబడి కూడా తగ్గుతుంది. కాబట్టి వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ తగు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జయరాజ్, రైతు బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కూరగాయ పంటలపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం ద్వారా వర్షాధారిత కూరగాయల పంటల అభివృద్ధి జిల్లా ఉద్యానశాఖ ఇన్‌చార్జి సీహెచ్ పండరి రైతులకు అవగాహన కల్పించారు. సమగ్ర కూరగాయల పంటలతో పాటు తేనెటీగల పెంపకం, వర్మి కంపోస్ట్ ఎరువు తయారీ, మందారం వంటి అంశాలపై రైతులకు క్లుప్తంగా వివరించారు. తద్వారా మంచి లాభాలను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి అనూషరెడ్డి, ఏఈఓ అస్మిత, రైతులు పాల్గొన్నారు.

బోర్ పైపులకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్


బోర్ పైపులకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో తాగునీరు వృథాగా పోతుంది. అధికారులు పట్టించుకోకపోవడంతో సాక్షి ఈనెల 14న మంగళవారం 'తాగునీటి వృథాను అరికట్టలేరా!' అనే కథనాన్ని ప్రచురించింది. దీంతో స్పందించిన అధికారులు బోర్ పైపు నల్లాలకు మరమ్మతులు చేపట్టారు. అదే విధంగా నల్లా ట్యాబ్ బిగించి తాగునీటి వృథాను అరికట్టారు. బోర్ చుట్టూ ఉన్న పాకూర్, మురికిని సైతం శుభ్రం చేయించారు. సాక్షి చొరవను గ్రామస్తులు అభినందించారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

నారాయణఖేడ్: ప్రతి ఒక్కరూ పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని పొగాకు నియంత్రణ జిల్లా సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఖేడ్ పట్టణంలోని ప్రధాన కూడళ్లు, పలు కాలనీల్లో బుధవారం బ్యానర్లు, ప్రదర్శిస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులైన గుట్కా, ఖైనీ, జర్దా, సిగరేట్, చుట్ట, బీడీ, పాన్ మసాలా వినియోగించడం వల్ల వివిధ రకాల క్యాన్సర్ల బారిన పడే ప్రమాదం ఉంటుందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయరాదని తెలిపారు. ప్రధానంగా యువతను లక్ష్యంగా చేసుకుని జిల్లాలో 60 రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పొగాకు ఉత్పత్తులు వాడబోమంటూ ప్రతిజ్ఞలు చేయించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **మెనూ పాటిస్తున్నారా?**

కంగ్టి(నారాయణఖేడ్): మండల కేంద్రం కంగ్టిలోని గిరిజన రెసిడెన్షియల్ బాలుర కళాశాలలో మెనూ ప్రకారం వంటలు వండుతున్నారా అని ఎంపీడీఓ సత్తయ్య విద్యార్థులకు అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా వంట సరుకుల నిల్వ గది, నీటి పరిశుభ్రత పరిశీలనలో భాగంగా ఆర్వో ప్లాంట్ పనితీరును పరిశీలించారు.

◆ **ఉద్యోగ బాధ్యతలు స్వీకరణ**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం తహసీల్దార్‌గా సరస్వతీ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

◆ **స్థల పరిశీలన**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధి తాట్‌పల్లి గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని బుధవారం ఎంపీడీఓ శ్రీనివాస్ పరిశీలించారు. మండలంలో 37 గ్రామ పంచాయతీలు ఉండగా నూతనంగా తాట్‌పల్లి గ్రామ పంచాయతీ ఏర్పాటైంది. కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలో పంచాయతీ భవనం నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు.

◆ **గురుకులంలో హెల్త్‌క్యాంప్**

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం నల్లవాగు గురుకుల పాఠశాలలో బుధవారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్ ప్రతిభ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగరం శ్రీనివాస్, ప్రిన్సిపాల్ తిరుపతయ్య, వైద్య సిబ్బంది చంద్రశేఖర్, కృష్ణవేణి పాల్గొన్నారు.

◆ **ఉపాధి పనులు చేపట్టాలి**

కల్హేర్(నారాయణఖేడ్): ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టాలని కల్హేర్ ఎంపీడీఓ రమేష్‌బాబు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్తులో పంచాయతీ సెక్రటరీలు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

◆ **కళాశాల అభివృద్ధికి కృషి**

మునిపల్లి(అందోల్): బుదేరా ప్రభుత్వ కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అధ్యాపకులకు హామీ ఇచ్చారు. బుధవారం మండలంలోని బుదేరా ప్రభుత్వ కళాశాలను సందర్శించి, కళాశాల స్లాబ్‌ను పరిశీలించారు.

గాలికుంటు టీకాలు తప్పనిసరి

పశువైద్యాధికారి శైలేంద్ర జస్వాల్


పటాన్‌చెరు టౌన్: టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది


వట్‌పల్లి(అందోల్): టీకా వేస్తున్న పశువైద్యాధికారి దివ్య

పటాన్‌చెరు టౌన్: పశువులు ఆరోగ్యంగా ఉండాలంటే గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి శైలేంద్ర జస్వాల్ అన్నారు. బుధవారం ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద కంజర్లలో 266 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సర్దార్, శ్రావణ్, ఆంజనేయులు, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి

రాయికోడ్(అందోల్): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి అని మండల పశువైద్యాధికారి పాండెన్ పోషకులకు పేర్కొన్నారు. మండల కేంద్రం రాయికోడ్, ఇంటికెపల్లి, కోడూరు, సంగపూర్ గ్రామాల్లో సిబ్బందితో కలిసి ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పశు పోషకుడు తమ పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలన్నారు. వ్యాధి సోకిన అనంతరం చికిత్స చేయించే బదులు నివారణ టీకాలు వేయించడం ఉత్తమమన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది అలీం, సుకేష్ పాల్, శ్రీకాంత్, దేవుడాస్, ఘని, మైనొద్దీన్, బసంతి, యాదమ్మ, పోషకులు ఉన్నారు.

సిర్గాపూర్ మండలం కడ్పల్‌లో..

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం కడ్పల్‌లో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ గంగాధర్ మాట్లాడుతూ.. పశువులకు టీకాలు వేయించాలని రైతులకు సూచించారు. వెటర్నరీ డాక్టర్లు జెస్సిక్రాంతి, నేతాజీ పాల్గొన్నారు.

దేవునూర్ గ్రామంలో..

వట్‌పల్లి(అందోల్): వాతావరణం మార్పుల దృష్ట్యా పశువులకు సోకే వ్యాధులను కట్టడి చేసేందుకు గాలికుంటు టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి డా.దివ్య తెలిపారు. బుధవారం మండలంలోని దేవునూర్ గ్రామంలో పశువులకు గాలికుంటూ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సకాలంలో రైతులు పశువులకు టీకాలు వేయించడం ద్వారా వ్యాధులు అరికట్టవచ్చన్నారు. టీకాలు వేయించకపోతే పశువులలో పాలోత్పత్తి, సంతానోత్పత్తి తగ్గుతుందన్నారు. నాలుగు నెలలుపై బడిన ప్రతి పశువుకు టీకాలు వేయించాలన్నారు. 84 పశువులకు గాలికుంటూ టీకాలు వేసినట్లు తెలిపారు.